వైభవంగా తొలేళ్ల

- రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన పూజారి



విజయనగరం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం సోమవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. పూసపాటి వంశీయులు కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె అదితి గజపతిరాజులు సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సభ్యులు కూడా పైడిమాంబకు పట్టువస్త్రాలు సమర్పించారు. పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఆదివారం రాత్రి 10.35 గంటల సమయంలో అమ్మవారిని తొలేళ్ల ఉత్సవానికి సిద్ధం చేస్తూ వివిధ నదీజలాలతో అభిషేకించారు. సిరిమాను అధిరోహించే పూజారి బంటుపల్లి వెంకటరావు అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.



పైడిమాంబ చదురుగుడి వద్ద భక్తుల కోలాహలం

నేడే సిరిమాను సంబరం

- నిర్దేశించిన సమయానికే ప్రారంభమయ్యే అవకాశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తొలి ఘట్టం అమ్మవారి తొలేళ్ల తంతు పూర్త యింది.. అసలు సంబరానికి వేళ అయింది. కొద్ది గంటల్లో అశేష జనవాహిని అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించే సిరిమానో త్సవం ఆరంభం కానుంది. నడిచే దేవత.. సిరిమాను రూపంలో కనిపించే పైడిమాంబను దర్శించుకునేందుకు ఇప్పటికే లక్షలాది మంది భక్తులు విజయనగరం చేరుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సిరిమాను బయలుదేరనుంది. ఇందుకు అను గుణంగా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. అమ్మవారి పరివారంగా పిలిచే జాలరి వల, అంజలి రథం, పాల ధార రథాల నిర్వాహకులకు ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు అధికారులు దిశను నిర్దేశించారు. ఆ రథాల వెంట వచ్చే వారి సంఖ్య తక్కువగా ఉండాలని, నిర్ణయించిన సమాయానికి అవి చదురుగుడికి చేరుకోవాలని చెప్పారు. సిరిమానోత్సవంలో పాల్గొనే వారికి ఈ ఏడాది కలెక్టర్ ప్రత్యేకంగా టీషర్ట్ అందించ నున్నారు. ఇది వరకు ఎవరికి వారే టీషర్ట్‌లు ధరించి సిరిమాను తిరిగే ప్రాంతాల్లో వందలాదిగా చేరేవారు. దీనివల్ల సామాన్య భక్తులకు ఇబ్బంది కలిగేది. ఈ ఏడాది అలాకాకుండా అధి కారికంగా టీషర్టులు ఇస్తున్నారు. దీనివల్ల ఇతరులు పాల్గొనే అవకాశం ఉండదు. మధ్యాహ్నం 3.30 గంటలకు సిరిమాను తిరగడం ప్రారంభిస్తే మూడు పర్యాయాలు మూడు లాంతర్ల నుంచి కోట వరకూ వెళ్లి వచ్చేందుకు సమయం దాదాపు రెండు గంటలు పడుతుంది. ఆ విధంగా ఆరు గంటలకు సిరిమానోత్స వాన్ని పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఊరేగింపును కోట బురుజు పైనుంచి పూసపాటి వంశీయులు తిలకిస్తారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ఉన్నతాధికారులు కూడా ఇక్కడి నుంచే వీక్షించే అవకాశం ఉంది. శాసన మండలిలో ప్రతి పక్షనేత బొత్స సత్యనారాయణతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యులు డీసీసీబీ నుంచి సిరిమాను ఊరే గింపును తిలకించే అవకాశం ఉంది. ఎప్పటిలాగే సిరిమానును పూజారి బంటుపల్లి వెంకటరావు అధిరోహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఉద యం 9 గంటల నుంచి 10 గంటల మధ్యలో సమర్పించనున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకనున్నారు.

కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించిన హోం మంత్రి అనిత

విజయనగరం క్రైం: పైడిమాంబని దర్శించుకునేందుకు సోమవారం రాత్రి విజయనగరం వచ్చిన హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సిరిమానో త్సవ నిర్వహణ కోసం చదురుగుడి వద్ద ఏర్పాటు చేసిన పోలీసు కంట్రోల్ రూంను పరిశీలించారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు, సీఐలతో ఆమె మాట్లాడారు.

పల్లెల్లో పండగ

- అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు
- భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, అధికారులు

పార్వతీపురం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండగ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పలు అభివృద్ధి కార్య క్రమాలకు శంకుస్థాపన, భూమి పూజలు చేశారు మరికొన్నిచోట్ల శిలాఫలకాలను ఆవిష్కరించారు. గుమ్మలక్ష్మీపురం, కురు పాం మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు గాను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, సీతానగరం, పార్వతీపురం మండలాల్లో బీటీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ మండలంలో రోడ్డు పనులకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపనలు చేశారు. ఈ నెల 20 వరకు అన్ని పంచాయతీలో పల్లె పండగ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

విజయవంతంగా నిర్వహించాలి

సాలూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండగ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మహిళా, శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో పల్లె పండగ నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే గుర్తించిన గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు తదితర పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేయాలన్నారు. వాటి నిర్మాణాల్లో ఎటువంటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. తాత్సారం పనికిరాదని తెలిపారు. అనంతరం జీగిరాం, నెలిపర్తి తదితర పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు అధికారులు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.



పల్లె పండుగపై అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్రమంత్రి సంధ్యారాణి

న్యూస్ బాక్స్

విద్యార్థులకు 'అపార్' ఐడీ

- తక్షణమే కేటాయించండి
- జిల్లా వృత్తి విద్యాధికారిణి మంజుల వీణ ఆదేశం

బెలగాం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు 'అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నెంబర్ క్రియేట్ చేయాలని జిల్లా వృత్తి విద్యాధికారిణి డి.మంజుల వీణ ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల విద్యార్థులకు తప్పనిసరిగా అపార్ ఐడీ కేటాయించాలని సూచించారు. ప్రతి విద్యార్థి కేటాయించే విశిష్ట సంఖ్య ద్వారా సంబంధించిన అకాడమీ ప్రగతి, చదివిన కోర్సుల డేటా ప్రభుత్వం వద్ద ఉంటుందన్నారు. వివిధ బోర్డులు, యూనివర్సిటీలు జారీ చేసే సర్టిఫికెట్స్‌పై 12 అంకెలతో కూడిన అపార్ నెంబర్ ముద్రిస్తారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారాన్ని తీసుకుని వారి వివరాలు నమోదు చేయాలని కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. తప్పులకు అవకాశం లేకుండా చూడాలని, జాగ్రత్తగా నమోదు చేసి ఐడీలు కేటాయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైబల్, సోషల్ వెల్ఫేర్, ఏపీఎంఎస్, కేజీబీవీ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాధికారిణి డి.మంజుల వీణ

ఒక్కటై.. చేజిక్కించుకుని!

- మద్యం వ్యాపారంలో టీడీపీ, వైసీపీ నాయకులు
- సిండికేట్‌గా మారి దుకాణాలను దక్కించుకున్న వైనం
- లాటరీ ప్రక్రియలో కలిసిమెలిసి హాజరు
- చర్చనీయాంశమైన ఇరు పార్టీ నేతల తీరు
- మహిళల పేరిట తొమ్మిది షాపులు



పార్వతీపురం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల విషయంలో టీడీపీ, వైసీపీ నాయకులు ఒక్కట య్యారు. సిండికేట్‌గా మారి దుకాణాలను దక్కించు కున్నారు. ఎన్నికల వరకే పార్టీల పరంగా వేర్వేరు.. మద్యం వ్యాపారంలో మాత్రం తామంతా ఒక్కటేనని నిరూపించారు. నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా జిల్లాలో 52 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. సిండికేట్‌లుగా ముద్రపడిన కొంతమంది మద్యం వ్యాపారుల ఆధ్వర్యంలో టీడీపీ, వైసీపీలకు చెందిన కొందరు ద్వితీయ శ్రేణులు ఒక గ్రూప్‌గా ఏర్పడి మద్యం దుకాణాలు పొందారని చెప్పొచ్చు. పార్టీలకతీతంగా కొంతమంది నాయకులు ఒక్కో దుకాణం కోసం దరఖాస్తులు చేయించారు. లాటరీలో ఎవరికి వచ్చినా సమాన భాగస్వామ్యంతో వ్యాపారాలు చేసుకుందామనే ఒప్పందంతో పెట్టుబడులు పెట్టి రంగంలోకి దిగారు. దీంతో కొన్ని దుకాణాలకు పెద్ద ఎత్తున దరఖాస్తులు రాగా, మరికొన్ని దుకాణాలకు మొక్కుబడిగా దరఖాస్తులు వచ్చాయి.

మద్యం షాపులకు మొత్తంగా 1,393 దరఖాస్తులు రాగా.. వాటిల్లో కొన్ని మినహా మిగిలిన దరఖాస్తులను టీడీపీ, వైసీపీ నాయకులు మండలాల వారీగా ఉమ్మడిగా దాఖలు చేసినట్లు స్పష్టమైంది. ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నేతలు సిండికేట్‌గా మారి లాటరీలో అత్యధికంగా షాపులను దక్కించుకున్నారు. మద్యం వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారులు కొంతమంది భారీగా దరఖాస్తులు చేసినప్పటికీ తగిన స్థాయిలో షాపులు రాలేదనే వ్యాఖ్యలు వినిపించాయి. లాటరీ ప్రక్రియలో ఎక్కడ చూసినా టీడీపీ, వైసీపీ నాయకులు కలిసికట్టుగా ఉండడం, సిండికేట్‌గా దరఖాస్తులు చేసుకున్నామని చెప్పుకోవడం కనిపించింది.

సిండికేట్‌ల హవా..

- జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో కనీసం పది నుంచి 30 మంది వరకు టీడీపీ, వైసీపీ నాయకులు ఒక గ్రూప్‌గా ఏర్పడి ఒక్కో దుకాణానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇటువంటి వారంతా ఉదయాన్నే లాటరీ ప్రక్రియ జరిగే ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. సిండికేట్‌గా ఏర్పడిన వారి నుంచి అత్యధికంగా దుకాణాలకు దరఖా స్తులు వచ్చినట్లు స్పష్టంగా కనిపించింది. ఓ ఇద్దరు మద్యం వ్యాపారులు ఒక గ్రూప్‌గా ఏర్పడి సుమారు 250 దరఖాస్తులు చేసుకోగా.. వారికి కేవలం నాలుగు దుకాణాలు మాత్రమే లభించడం చర్చనీయాంశమైంది.
- ఒక సిండికేట్ 32, మరో గ్రూపు సుమారు 22 దరఖాస్తులు చేయగా వారికి చెరో రెండు దుకాణాలు లభించాయి.
- ఒక నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు 50 దరఖాస్తులు చేయగా ఒక దుకాణం మాత్రమే లభించిందని చెప్పుకోవడం కనిపించింది.
- అత్యధికంగా దరఖాస్తులు వచ్చిన వీరఘట్టం మండలంలో సిండికేట్‌ల హవా కనిపించింది. లాటరీ ప్రక్రియకు భారీ సంఖ్యలో వ్యాపారులు హాజరయ్యారు.
- లాటరీ ప్రక్రియకు మహిళలు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు. మొత్తంగా తొమ్మిది మంది మహిళలకు మద్యం షాపులు లభించాయి.

మిగతా 8వ పేజీలో...

పారదర్శకంగా లాటరీ ప్రక్రియ

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా పారదర్శకంగా లాటరీ ప్రక్రియ చేపట్టామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాలులో జిల్లాలోని 52 మద్యం దుకాణాలకు డ్రా తీశారు. కలెక్టర్‌తో పాటు జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో అధికారులు టెండర్ బాక్సులను తెరిచి దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ ప్రారంభిం చారు. సీరియర్ నెంబర్ ప్రకారం మద్యం దుకాణాలకు లాటరీ తీశారు. ఎవరికి మద్యం దుకాణం లభించిందో అధికారులు ప్రకటించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.రామచంద్రరావు ఆధ్వర్యంలో దుకాణాల కేటా యింపు ప్రక్రియ చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సహాయక కమిషనర్ రామచంద్రరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్, సీఐ సురేష్, ఏఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.



లాటరీ ప్రక్రియలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

జీసీసీ..ఏమిటీ పరిస్థితి?

- ఆన్‌లైన్ విధానంతో కుదేలైన వ్యాపారం
- మార్కెటింగ్‌కు ఎదురవుతున్న అడ్డంకులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- గిరిజన రైతులకు తప్పని ఇబ్బందులు

సీతంపేట రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులను అన్నీ విధాలుగా సేవలందించాల్సిన గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆ దిశగా ముందుకెళ్లడం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం లేదు. సరైన గిట్టుబాటు ధర కల్పించడం లేదు. దీంతో గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దళారుల దోపిడీకి గురై నిలువునా మోసపోతున్నారు. వాస్తవంగా ఏజెన్సీలో ప్రధాన పంటలైన కొండచీపుర్లు, నరమామిడి చెక్క, నల్లజీడి, పసుపు, చింతపండు తదితర వాటిని గిరిజనుల నుంచి జీసీసీ కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే గడిచిన కొన్నేళ్లుగా ఈ ఉత్పత్తులకు ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు జరపడంతో ఆశించిన స్థాయిలో జీసీసీ వ్యాపారం ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆఫ్‌లైన్ ద్వారా ఆ సంస్థ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మారింది. ఆన్‌లైన్ టెండర్‌మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఎస్‌టీసీ) విధానం వల్ల జీసీసీ వ్యాపారానికి గండి పడింది. అటవీ ఉత్పత్తులన్నీ ఈ విధానం ద్వారానే విక్రయాలు చేస్తుండడంతో మార్కెట్ రంగంలో జీసీసీ కుదేలైంది. దీంతో ప్రైవేటు వ్యాపారులు ఇష్టారాజ్యంగా అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి గిరిజన రైతులను దోచుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రైవేట్ వ్యాపారులను అదుపు చేయాల్సిన జీసీసీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జీసీసీ డీఎం ఏమన్నారంటే...

' వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా కొండచీపుర్ల కొనుగోలు, విక్రయాలు జరుగుతాయి. ఈ కేంద్రాల ద్వారా గిరిజన రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. జీసీసీ ద్వారా వీడీవీకేలకు కటింగ్‌మిషన్లు అందజేస్తున్నాం. కొండచీపుర్ల సీజన్ ఇంకా ప్రారంభం కాలేదు. సీజన్‌లో జీసీసీ ద్వారా వాటితో పాటు నల్లజీడి, నరమామిడి చెక్కను కూడా కొనుగోలు చేస్తాం' అని జీసీసీ డీఎం సంధ్యారాణి తెలిపారు.

మిగతా 8వ పేజీలో...



సీతంపేట జీసీసీ కార్యాలయం

సూరమ్మ.. స్వయంకృషికి చిరునామా


సూరమ్మ

బొబ్బిలి(ఆంధ్రజ్యోతి)

- అక్షరజ్ఞానం లేకపోయినా లెక్కలలో ఘనాపాటి
- నాడు ఊరూరా దంపుడు బియ్యం విక్రయం
- నేడు బియ్యం వ్యాపారిగా జీవనం
- నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం

ఆ బామ్మకు అక్షర జ్ఞానం అంతగాలేదు. అయినా ఆమె లెక్కలు వేయడంలో దిట్ట. కనీసం సంతకం కూడా చేయలేదు. కానీ చేతివేళ్లతోనే బియ్యం, ధాన్యం లావాదేవీల లెక్కలన్నీ టక టకా చెప్పేస్తుంది. ఇదీ బొబ్బిలి గొడువీధికి చెందిన గునాన సూరమ్మ అలియాస్ సుంకర సూరమ్మ ప్రత్యేకత. ప్రస్తుతం ఆమె వయసు 95. పుస్తకం, కలం ఏమీ లేకుండానే లెక్కలు చేసేస్తుంది.

పూర్వ నుంచీ...

సూరమ్మ పూర్వీకులు దంపుడు బియ్యం విక్రయించేవారు. ఒడిశాలోని జైపూర్ తదితర ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు చేసి... వాటిని ఇళ్లలో దంచి... ఆ బియ్యాన్ని తలపై మోసు కుంటూ ఊరూరా తిప్పి అమ్మేవారు. సూరమ్మకు ఇప్పుడు ప్రత్యేకంగా సార్టెక్స్ రైస్‌మిల్లు... సుమారు 35 ఎకరాలకు పైగా పంట భూములు, సూరమ్మ లారీ ట్రాన్స్‌పోర్టు, సూరమ్మ హెచ్‌పీ గ్యాస్, సూరమ్మ స్టీల్స్ అండ్ సిమెంట్ షాపులకు అధి నేతగా ఎదిగింది. నిత్యం 50 కిలోమీటర్ల దూరం నడుచు కుంటూ... తాము స్వయంగా దంచిన బియ్యం మోసుకుంటూ ఊరూరా తిప్పి అమ్ముకునే సూరమ్మ స్వయంకృషితో అంచె లంచెలుగా ఎదిగింది.

ఇదీ దినచర్య.

రోజూ వేకువజామున లేచి చద్దన్నం తిని... వాకింగ్ చేసు కుంటూ పంట పొలాలను పర్యవేక్షించుకుంటుంది. గొల్లపల్లి గ్రామంలో తన సొంత రైసుమిల్లు బాధ్యతలను స్వయంగా చూసుకుంటుంది. ఆమె భర్త పెంటయ్య పదేళ్ల క్రితం మృతి చెందారు. ఆయన వ్యవసాయం చేసుకునేవారు. సోదరుడు సుంకర రాములు మున్సిపల్ కౌన్సిలర్‌గా, పెద్ద కుమారుడు గునాన వెంకటరావు అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా, పెద్ద కోడలు గునాన విజయలక్ష్మి మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్‌గా పనిచేశారు. రెండో కుమారుడు శ్రీరామ్మూర్తిని, మనవడు కిరణ్‌కుమార్‌లు వ్యాపార బాధ్యతలలో పాలు పంచుకుంటున్నారు.

యుక్త వయసు నుంచే బియ్యం వ్యాపారం: సూరమ్మ

మేము చిన్నప్పుడు బొబ్బిలిలో ఉండే పెద్ద రైసుమిల్లులో పనిచేసే వాళ్లం. మా అమ్మ గంగమ్మ ఎంతో కష్టపడి దంపుడు బియ్యం తయారు చేసేది. ఆమె వారసత్వంగా నేను కూడా దంపుడు బియ్యం తయారు చేసి అమ్మేదాన్ని. ఆ తరువాత సొంతంగా రైస్‌మిల్లు పెట్టుకున్నాం. ఇప్పుడు నా వయస్సు 95 ఏళ్లు. 75 ఏళ్లుగా ఈ పనిలో ఉండడంతో ధాన్యం- బియ్యం వ్యాపారంలో మెలకువలన్నిటినీ ఔపోసన పట్టగలిగాను. మాకు అచ్చి వచ్చిన వ్యాపారమిది. అలా భూములను కొనుగోలు చేసుకొని సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. కుమారులు ప్రయోజకులై వ్యాపారరంగంలో స్థిరపడ్డారు. నా ఊపిరి ఉన్నంత వరకు శ్రమిస్తాను.

మా అమ్మ మాకు దేవుడు ఇచ్చిన వరం..

మా పూర్వీకులు దంపుడు బియ్యం వ్యాపారం చేసుకునే వారు. అలా మా అమ్మ సూరమ్మ కూడా గ్రామాలలో నడుచుకుంటూ... బియ్యం తలపై మోసుకుంటూ అమ్మకాలు సాగించేది. ఆమె ఆహారపు అలవాట్లు ఏమాత్రం మారలేదు. బీపీ, షుగర్ వంటి వ్యాధులు ఆమెను తాకలేకపోయాయి. ఎవరిపై ఆధార పడకుండానే జీవనం సాగిస్తోంది. పంట పొలాలకు వెళుతుంది. రైస్‌మిల్లు, ఇతర వ్యాపారాలను స్వయంగా పర్యవేక్షిస్తుంది. ఆమె చేతితో నూతన వ్యాపారాలను ప్రారంభించుకునేందుకు ఔత్సాహిక వ్యాపారులు ఆసక్తి చూపుతుంటారు. మా అమ్మ మాకు దేవుడిచ్చిన వరం. ఆమె జ్ఞాపకశక్తి అమోఘం. ఆమె మాట మాకు శాసనం.

-గునాన శ్రీరామ్మూర్తి, వ్యాపారవేత్త

కాయకష్టంతో జీవనం..


వెంకటమ్మ

బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండలం కోమటి పల్లి గ్రామానికి చెందిన కొమ్మనపల్లి వెంకటమ్మకు 84 సంవత్సరాలు. ఆమెకు ముగ్గురు కొడుకులు ఉన్నా వారంతా వలస కూలీలుగా జీవనం సాగించేందుకు తలో ప్రాంతానికి వెళ్లిపోయారు. వెంకటమ్మకు భర్త చనిపోవడం... కుమారులకు, కుమార్తెకు పెళ్లిళ్లు కావడంతో ఆమె ఒంటరి జీవనం సాగిస్తోంది. నూనె గానుగను నడుపుకుంటూ.... ఆ పనిలేనప్పుడు వ్యవసాయ కూలీగా పనిచేసి పిల్లలను పోషించి పెద్దవారిని చేసింది. నూనెగానుగలకు ఇప్పుడు ఆదరణ లేకపోవడం, వయోభారంతో ఆమె ఇంట్లో ఒంటరిగానే జీవనం సాగిస్తోంది.

పింఛనుతో బతుకుబండిని లాగిస్తున్నాను..

ప్రభుత్వం ఇచ్చిన పింఛనుతో బతుకు బండిని లాగుతున్నాను. శరీరం సహక రించకపోవడంతో ఎటూ వెళ్లలేకపోతున్నాను. కూతురు పిల్లలు అప్పుడప్పుడు వచ్చి సహక రిస్తున్నారు. నలుగురు పిల్లలకు పెళ్లిళ్లు చేసి పంపించాను. నాకు అదే తృప్తి.

-వెంకటమ్మ





పల్లెల్లో మహిళల జీవనశైలి దృశ్యాలు

పొద్దు పొడవక మునుపే కదిలి...

బొబ్బిలి/ బొబ్బిలి రూరల్ (ఆంధ్రజ్యోతి): పొద్దుపొడవక మునుపు బయలుదేరడం... పొద్దుగూకిన తరువాత ఇంటికి చేరడం... ఇదీ గ్రామీణ మహిళల నిత్య కృత్యం. అతివలు ఇంటిల్లిపాదికీ వంటావార్పూ చేసి అందరికీ అన్నీ సమ కూర్చి... పశువులకు, కోళ్లకు మేత సమకూర్చి... చీకటి ఉండ గానే పనులు ప్రారంభించి పొలానికి బయలుదేరుతారు. అక్కడ పొలం పనులు ముగిసిన తరువాత మళ్లీ ఇంటికి చేరుకొని మగవాళ్లకు చద్దన్నం లేదా మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసి... మళ్లీ మండుటెండలో పొలానికి లేదా పని ప్రదేశానికి వెళతారు. పొద్దు గూకిన తరువాత ఇళ్లకు చేరుతారు. మళ్లీ వంటపనులు, ఇంటి పనులలో నిమగ్నమ వడం వాళ్ల దైనందిన జీవనంలో భాగం. పల్లెల్లో ప్రతి రోజూ కనిపించే ఈ దృశ్యాల వెనుక ఎన్నో గాథలు. కుటుంబ అవస రాలు ముడిపడి ఉంటాయి. చీకట్లో నడిచి వెళ్లేటప్పుడు పాములు, విషపురుగుల బెడద విపరీతంగా ఉంటుంది. విద్యుత్ వైర్లు నుంచి కూడా ముప్పు వాటిల్లిన దాఖలాలు కూడా అనేకం. అయినా వాటిని లెక్క చేయకుండా నిత్యం పనుల బాట పట్టడం గ్రామీణ మహిళల నిబద్ధతకు అద్దం పడుతుంది.







పండగ శోభ

విజయనగరం పూర్తిగా పండగ కళను సంతరించుకుంది. తొలేళ్లను పురస్కరించుకుని భక్తులు వివిధ రూపాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అమ్మవారికి వివిధ రకాల పండ్లను నివేదించారు.



అద్భుత ఘట్టం.. సిరిమానోత్సవం!

- ఏళ్ల తరబడి నిర్విఘ్నంగా నిర్వహణ
- పూజారి కలలో చెప్పిన విధంగా చింతమాను చెట్టు ఎంపిక


తుది దశకు చేరుకున్న సిరిమాను తయారీ

విజయనగరం రూరల్ (ఆంధ్రజ్యోతి)

కోరిన వరాలిచ్చే కల్పవల్లి పైడిమాంబ సిరిమానోత్సవం.. ఓ అద్భుత ఘట్టం. ఏళ్ల తరబడి నిర్విఘ్నంగా ఈ ఉత్సవం కొనసాగు తోంది. సిరిమానును అధిరోహించిన తొలి పూజారి పతివాడ అప్పలనాయుడు నుంచి ఇప్పటి బంటుపల్లి వెంకటరావు వరకూ.. వారసత్వంగా ఆ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుత రైల్వేస్టేషన్ రోడ్డులోని వనంగుడి పురాతన మైనది. పెద్దచెరువుకి ఆనుకొని ఉన్న ఈ ఆలయం పైడిమాంబ వనంగుడిగా పిలుస్తారు. మూడులాంతర్లు వద్ద ఉన్న గుడిని చదురుగుడి గా పిలుస్తారు. ఆరు నెలల పాటు వనంగుడిలో.. మరో ఆరు నెలలు చదురుగుడిలో పైడిమాంబ ఉంటూ... దర్శనమిస్తారన్నది భక్తుల నమ్మకం.

సిరిమాను ఎందుకు తిరుగుతుంది?

అమ్మవారి ప్రతి రూపం సిరిమాను. పూర్వకాలంలో కలరా, మశూచి వంటి వ్యాధులు ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవి. అటువంటి సమయంలో అమ్మవారి ప్రతి రూపంగా భావించే పైడిమాంబ తానే భక్తుల ముగింటకు వెళ్లడం.. ఈ ప్రాంతం అంతా బాగుండాలని కోట శక్తికి పూజలు చేయడం వంటి వాటి కోసమే ఈ సిరిమాను విహార మన్నది పూర్వీకుల అభిప్రాయం. పైడిమాంబ ఆలయం ముందు ధ్వజస్తంభం ఉండదు.

పూజారి కలలో చెప్పిన విధంగా..

ఏటా సిరిమానోత్సవానికి ఉపయోగించే చింత మాను ఎంపిక సంప్రదాయబద్ధంగా జరుగు తుంది. సిరిమానోత్సవానికి పందిరిరాట వేసిన అనంతరం పూజారి కలలో అమ్మవారు కని పించి... సిరిమానుకు ఉపయోగించే చెట్టు ఎక్కడుందో చెబుతుందనేది నమ్మకం. ఆ దిశగా పూజారి, ఆలయ సిబ్బంది వెళ్లి అన్వేషిస్తుంటా రు. ఆ మార్గంలో కనిపించే చింతమాను చెట్టు ను గుర్తించి.. పూజా కార్యక్రమాలు నిర్వహించ డం, ఆ చెట్టును విజయనగరం తీసుకురావడం... తదితర కార్యక్రమాలన్నీ నిర్దేశించిన ముహూర్తం ప్రకారం... సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు.

పూర్వజన్మ సుకృతం..



సిరిమానును అధిరోహించడం పూర్వజన్మ సుకృతం. తాత, తండ్రి, ఆ తరువాత నేను.. ఎన్నో ఏళ్లుగా మేం పూజారులుగా ఉంటూ... మా కుటుంబసభ్యులం సిరిమానును అధిరోహిస్తున్నాం. నా తండ్రి బంటుపల్లి బైరాగి నాయుడు 27సార్లు సిరిమానును అధిరోహించారు. నేను ఇంత వరకూ ఏడు పర్యాయాలు అధిరోహించాను. తాజాగా సిరిమానును అధిరోహిస్తే... ఎనిమిదోసారి అవుతుంది. సిరిమానోత్సవం అనేది చరిత్రాత్మక ఘట్టం. ఎన్నో ఏళ్ల నుంచి నిర్విఘ్నంగా కొనసాగుతోంది. నడిచే దేవతగా... పైడిమాంబకు ప్రతి రూపంగా భక్తులు సిరిమానును పూజిస్తారు.

-బంటుపల్లి వెంకటరావు, పూజారి

వారసత్వంగా..



చింతమాను చెట్టుని సిరిమానుగా మలిచే ప్రక్రియలో నేను నాన్నతో కలిసి భాగస్వామిని. వారసత్వంగా నా తండ్రి ఆ పని నేర్పించారు. మా నాన్న మరణించిన తరువాత నేను కూడా గత పదేళ్లగా నిర్విరా మంగా సిరిమానుగా మలిచే ప్రక్రియలో పాల్గొం టున్నాను. చింతమాను చెట్టును చెక్కుతుంటే.. ఎంతో ఆనందం కలుగుతుంది. లక్షలాది మంది వీక్షించే ఈ ఉత్సవంలో నేను ముఖ్యపాత్ర పోషించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆ తల్లి దయ వల్ల నా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది.

-మీసాల అచ్చెంనాయుడు

నియమ నిబంధనలతో..



సిరిమానుకి ఉపయోగించే చెట్టును గుర్తించిన తరువాత పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పూజారి బంటుపల్లి ఇంటి వద్ద సిరిమానుగా మలిచే ప్రక్రియకు శ్రీకారం చుడతాం. ఈ ప్రక్రియను నియమ, నిబంధనలతో నిర్వహిస్తాం. ఉదయాన్నే స్నానాది కార్యక్రమాలు ముగించుకుని... ఈ చెట్టును సిరిమానుగా మలుస్తాం. ఇరుసుమాను, పూజారి పీట, గిలకలు, అమ్మవారి పరివారంగా భావించే రథాలకు ఉపయోగించే వాటిని కూడా తీర్చిదిద్దుతాం. వాటికి నిర్దేశించిన రంగులు పురా తన కాలం నుంచి వస్తున్నవే వినియోగి స్తున్నాం.

-ఎన్ వెంకటేశ్వరరావు

చిక్కులు... చక్కదిద్దేదెప్పుడో!

- పీజీఆర్ఎస్‌లో భూసమస్యలపై వినతుల వెల్లువ
- పరిష్కారం కాక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- కూటమి ప్రభుత్వ స్పందనపైనే ఆశలు



కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులు పరిష్కారం కావడం లేదు. గత ప్రభుత్వంలో వందలాదిగా పేరుకుపోయిన విన్నపాలు నేటికీ అలాగే ఉన్నాయి. వారంతా కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. మండల అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు ప్రదక్షిణలు చేస్తున్నారు. అత్యవసర సమయంలో భూములు అమ్ముకోలేక.. ఆన్‌లైన్ తప్పిదాలతో పథకాలకు నోచుకోక.. సరిహద్దు వివాదాలు కొలిక్కిరాక వారంతా నరకం చూస్తున్నారు.

జామి మండలం ఎంకేవలస పంచాయతీ పరిధిలోని బలరాంపురానికి చెందిన పొటుపురెడ్డి అప్పారావుకు చెందిన ఆధార్ నెంబరుకు విజయనగరం మండలం రాకోడు రెవెన్యూ పరిధిలో ఖాతా నెంబరు 101లో ఉన్న సర్వేనెంబర్లు అనుసంధానమైపోయాయి. వెబ్‌ల్యాండ్‌లో అవే కనిపిస్తున్నాయి. తన ప్రమేయం లేకుండా భూమి పెరగడంతో ప్రభుత్వ పథకాలకు దూరం అయ్యాడు. అలాగే బలరాంపురంలో కూడా ఆయన ఆధార్ నెంబరుకు సర్వే నెంబరు 75-4ఏ పేరుతో కొంత భూమి వివరాలు నమోదయ్యాయి. దీంతో భూమి ఎక్కువుందంటూ గత ప్రభుత్వ హయంలో ఆయన భార్యకు చేయూత పథకం నిలిచిపోయింది. దీనిపై అధికారులకు ఆయన అనేకసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదు.

ఎల్.కోట మండలం తామారాపల్లికి చెందిన బొబ్బిలి రమణకు 115-3,2,132-25, 132-26, 119-24 సర్వే నెంబర్లలో వారసత్వంగా వచ్చిన భూమి ఉంది. ఆ భూమిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 2020 సంవత్సరంలో నకిలీ డాక్యుమెంట్ సృష్టించి ఆయన పేరున మార్పు చేసుకున్నాడు. దీనిపై రమణ అనేకసార్లు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కు కూడా విన్నవించారు. అయినా ప్రయోజనం లేకపోయింది.

భోగాపురం మండలం రావాడ గ్రామానికి చెందిన చందాల వెంకటరమణకు వారసత్వంగా వచ్చిన సర్వే నెంబరు 127-4 (77 సెంట్లు)లోని 70 సెంట్ల భూమిని 2004లో విక్రయించుకున్నాడు. మిగిలి ఉన్న ఏడు సెంట్లను అధికారికంగా కొనుగోలు చేయకుండా గ్రామానికి చెందిన వేరే వ్యక్తి ఆయన పేరున ఆన్‌లైన్‌లో మార్పు చేసేశాడు. ఆ తర్వాత విక్రయించేశాడు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ వెంకటరమణ అనేక సార్లు మండల అధికారులను ఆశ్రయించాడు.

జామి మండలం అలమండ పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన శీర దేముడుకి గ్రామ రెవెన్యూ పరిధిలో (గ్రామ కంఠం) సర్వే నెంబరు 435-17లో వారసత్వంగా వచ్చిన 16 సెంట్ల భూమి ఉంది. కొంతభాగంలో ఇల్లు నిర్మించుకోగా, మిగిలిన ఖాళీ స్థలంలో పశువుల శాల నిర్మించుకున్నాడు. ఆ భూమిని గ్రామానికి చెందిన వేరే వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడంతో కోర్టును ఆశ్రయించాడు. ఇదే భూమిపై ఆలయ నిర్మాణానికి కూడా స్థానికులు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులకు తెలియజేసినా చర్యలు లేవని ఆయన వాపోతున్నాడు.

ఇక ప్రభుత్వ మద్యం షాపులకు చెక్

- రేపటి నుంచి తెరుచుకోనున్న కొత్త దుకాణాలు
- అందుబాటులోకి నాణ్యమైన బ్రాండ్లు
- రూ.99కే క్వార్టర్.. మద్యం ప్రియుల్లో ఆనందం

రాజాం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం షాపులు మంగళవారం రాత్రి నుంచి మూత పడనున్నాయి. అయిదేళ్లకు పైగా మద్యంప్రియులతో ఆటలాడుకున్న వైసీపీ ప్రభుత్వ చర్యలకు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడింది. ఇందులో భాగంగా కొత్త మద్యం పాలసీకి తెరపైకి తెచ్చింది. కొత్త పాలసీని ప్రకటించి నియమ నిబంధనలు రూపొందించింది. జిల్లాలో నిర్దేశించిన ప్రాంతాలలో 153 మద్యం షాపులకు ఔత్సాహికుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చి పడ్డాయి. దీంతో ఈనెల 14న కలెక్టర్, ఎక్సైజ్‌శాఖ అధికారుల సమక్షంలో లాటరీ పద్ధతిన షాపుల ఎంపిక చేశారు. టెండర్లు దక్కించుకున్న వారు ఈనెల 16 నుంచి షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి తొమ్మిది గంటలతో ప్రభుత్వ మద్యం దుఖాణాలు మూతపడనున్నాయి.

అయిదేళ్లూ అవస్థలే..

2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలన్నింటితో పాటు మద్యం పాలసీని కూడా ఛిన్నాభిన్నం చేసింది. అప్పటివరకూ ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టాలని నిర్ణయించింది. షాపులను అద్దెకు తీసుకుని వైసీపీతో అంటకాగిన వారికి, నాయకులు సిఫార్సు చేసిన వారిని సిబ్బందిగా నియమించి అమ్మకాల ప్రక్రియ చేపట్టింది. బ్రాండెడ్ మద్యానికి తిలోదకాలిచ్చి ఊరూపేరూ తెలియని బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. ధరలను ఇష్టారాజ్యంగా పెంచుతూ వచ్చింది. ధరలు పెంచితే మద్యం సేవించే వారి సంఖ్య తగ్గుతుందని వక్రభాష్యం పలుకుతూ అయిదేళ్లూ అమ్మకాలు చేసింది.

రకరకాల బ్రాండ్లు..

దశాబ్దాల కాలంగా అందుబాటులో ఉన్న బ్రాండ్లకు తిలోదకాలిచ్చిన వైసీపీ ప్రభుత్వం జె బ్రాండ్లకు ప్రాధాన్యతనిచ్చింది. భూం.. భూం వంటి బీర్లను ప్రెసిడెంట్ మెడల్, స్పెషల్ స్టేటస్ వంటి పేర్లతో విస్కీలను అందుబాటులోకి తెచ్చింది. గతి, గత్యంతరం లేక మద్యం ప్రియులంతా వాటినే తాగుతూ అనారోగ్యం పాలయ్యారన్న విమర్శలు ఉన్నాయి. అప్పటి సర్కారు అక్కడితో ఆగకుండా ఎప్పటికప్పుడు మద్యం బ్లాక్ చేస్తూ మందుబాబుల సహనంతో పరాచికాలాడింది. సార్వత్రిక ఎన్నికలలో అన్నివర్గాలతో పాటు మద్యం ప్రియులు వైసీపీని ఓడించారు. ఫలితంగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. అందరికీ ఆమోదయోగ్యమైన నూతన మద్యం పాలసీని తెరపైకి తెచ్చింది.



ఆనందంలో మద్యం ప్రియులు..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.90కే లభ్యమయ్యే చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ ధరను వైసీపీ ప్రభుత్వం అమాంతంగా రూ.150కి పెంచింది. ధర పెంచినా నాణ్యమైన మద్యం అందుబాటులో లేకపోవడంతో సామాన్య, మధ్యతరగతి చెందిన మందుబాబులు అయిదేళ్లూ నరకయాతన అనుభవించారు. అయితే కొత్త మద్యం పాలసీలో రూ.99కే నాణ్యమైన క్వార్టర్ బాటిల్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పాటు గతంలో అందుబాటులో ఉండే నాణ్యమైన బ్రాండ్లను ధరలు తగ్గించి ఇస్తామని ప్రకటించడంతో మద్యం ప్రియులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కన్నా...ఎలా పట్టుకోను నీ చేయి!

దత్తిరాజేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొద్దిసేపటి క్రితం వరకూ బిడ్డ చేయి పట్టుకొని నడిపించాడా తండ్రి. అదే బిడ్డ చేయి తన కళ్లెదుటే తెగి పడిపోవడంతో...బిడ్డ భవిష్యత్తును తలచుకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. గుండెలు పిండేసే ఈ దుర్ఘటన దత్తిరాజేరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పికారుగంజి రోడ్డు జంక్షన్‌లో జాతీయ రహదారిపై లారీ, బస్సు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్టేషన్ బూర్జవలస హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ వివరాల మేరకు.. విశాఖ నుంచి సాలూరు వైపు వెళుతున్న బస్సు... రామభద్రపురం వైపు నుంచి గజపతినగరం వైపు వెళుతున్న టిప్పర్ లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో తండ్రి మజ్జి షండుకు భుజం, ముఖంపైన తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడు బల్లేస్ కుడిచేయి తెగి నేల మీద పడింది. తలపై కూడా గాయాలయ్యాయి. ఓవైపు తమకు గాయాలై రక్తమోడుతున్నా లెక్క చేయకుండా..బిడ్డను ఒడిలో పెట్టుకొని నడిరోడ్డుపై కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఆ తల్లిదండ్రులను చూసిన వారి కళ్లు చెమర్చాయి. క్షతగ్రాతులను విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ప్రభాకర్ తెలిపారు. షండు భార్య కూడా వీరితో పాటు బస్సులో ప్రయాణిస్తోంది. క్షతగాత్రుల స్వస్థలం ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పొట్టంగి మండలం సగ్గివాడవలస గ్రామం.

ఆర్టీసీ బస్సులో పొగలు



ప్రయాణికులను కిందకు దించుతున్న దృశ్యం

రేగిడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాలకొండ -రాజాం మార్గం సంకిలి గ్రామం వద్ద ఆర్టీసీ బస్సులో పొగలు వ్యాపించాయి. త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. సిబ్బంది, ప్రయాణికులు అప్రమత్తమై బస్సు నిలిపివేయటంతో పెద్దప్రమాదం తప్పింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలకొండ నుంచి రాజాం వైపు ఆర్డినరీ ఆర్టీసీ సర్వీస్ 20 మంది ప్రయాణికులతో వెళుతోంది. పాలకొండ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంకిలి చేరేసరికి వెనక టైరు నుంచి పొగలు వ్యాపించాయి. ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది గుర్తించి అప్రమత్తమయ్యారు. సంకిలి బస్సు స్టాండ్ వద్ద బస్సు నిలిపివేసి ప్రయాణికులను దించేశారు. వేరే బస్సులో వారిని పంపించారు. ఎవరికీ ఏమీ కాకపోవటం... బస్సులో నుంచి సురక్షితంగా బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



బందోబస్తుపై చర్చిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదేవత పైడిమాంబ పండుగ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ వకుల్‌జిందాల్ సోమవారం పర్యవేక్షించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేద్కర్ కూడలి, పైడిమాంబ ప్రధాన ఆలయం, మూడులాంతర్లు, కోట జంక్షన్, కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో జేబు, మొబైల్ దొంగతనాలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పండుగను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎవరితో నూ గొడవ పడవద్దన్నారు. సమయంలో సంయమనం పాటించాలని సూచించారు. ఎస్పీ వెంట ఏఎస్పీలు సౌమ్యలత, మోహనరావు, సీఐలు వెంకటరావు, నర్సింహమూర్తి, ధనుంజయ్, సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ పోస్టులకు దరఖాస్తులు

రేగిడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేజీబీవీ, సాంఘిక సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న టైప్-3, టైప్-4పోస్టులకు దరఖాస్తుల సందడి మొదలైంది. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. ఎంఈఓ వరప్రసాదరావు వీటిని స్వీకరించారు. ఈ పోస్టులు తక్కువగా ఉన్నప్పటికీ దరఖాస్తు దారులు పెద్ద సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది.

పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు

చదురుగుడి, వనంగుడుల వద్ద ప్రత్యేక పూజలు... అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు



పైడిమాంబ దర్శనానికి వేచి ఉన్న భక్తులు

విజయనగరం రూరల్/ విజయనగరం క్రైం: అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులతల్లి పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం సందర్భంగా చదురుగుడి, రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇప్పటికే ఈ రెండు ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. రాత్రి 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య పైడిమాంబకు వివిధ నదీజలాలతో అభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనానికి అవకాశం కల్పించారు. సోమవారం వేకువజాము 4 గంటల నుంచి అశేష సంఖ్యలో భక్తులు దర్శనానికి తరలివచ్చారు. కిలోమీటరుకు పైగా బారులు తీరారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రముఖులు, వీఐపీలు వచ్చినప్పుడు కూడా సాధారణ భక్తుల దర్శనానికి ఇబ్బంది లేకుండా దర్శనాలు చేయిస్తామని చెబుతున్నారు. సోమవారం సాయంత్రం నుంచి భక్తుల సంఖ్య క్రమేపీ పెరిగింది.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

పైడిమాంబను తొలేళ్ల రోజైన సోమవారం కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ సునీలా గజపతి రాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విజయనగరం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, విద్యాశాఖ కాకినాడ ఆర్‌జెడీ నాగమణి తదితరులు దర్శించుకున్నారు.

ఆంక్షలతో ఇక్కట్లు

పైడిమాంబ సిరిమానోత్సవ ప్రక్రియలో సోమవారం తొలేళ్ల సందర్భంగా నగరంలో పోలీసు ఆంక్షలు భక్తులు, వాహనదారులకు తలనొప్పిగా మారాయి. అంబటి సత్తర్వు నుంచి కొత్తపేట నీళ్లట్యాంకుకు వెళ్లే రహదారిలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద, అదే విధంగా మూడులాంతర్లు నుంచి కోటకు వెళ్లే దారిలో జీయర్ కమర్షియల్ కాంప్లెక్స్ వద్ద, మూడు లాంతర్లు నుంచి గంట స్తంభానికి వెళ్లే రహదారిలో... కోట నుంచి గుమ్చీ రోడ్డుకి వెళ్లే రహదారి గుమ్చీ వద్ద పోలీసు చెక్ పాయింట్లతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారనే విమర్శలు మూటగట్టుకున్నారు. ఏటా సిరిమానోత్సవం రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకే ఆంక్షలు విధిస్తారు. ఈ ఏడాది పోలీసుల తీరు విమర్శలు మూటగట్టుకుది. ద్విచక్ర వాహనదారులన కూడా వెళ్లనీయని పరిస్థితి. ఆలయం వద్ద పోలీసులు కూడా 'అతి' చేశారు. ఒకవైపు పాలకులు, ఆలయ ధర్మకర్త సైతం ఈసారి ప్రజలకు ఉచిత దర్శనం.. మంచి ఏర్పాట్లు అని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇవేవీ కనిపించలేదు. మంగళవారమైనా సరిదిద్దాలని భక్తులు కోరుతున్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

బొబ్బిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల నేత, రచయిత, ప్రజాఉద్యమకారుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో సోమవారం వామపక్ష, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశద్రోహ చట్టాల కింద ప్రజాస్వామ్యవాదులను అరెస్టు చేసి జైళ్లలో కుక్కడం కేంద్ర ప్రభుత్వానికి సర్వ సాధారణమైపోయిందని వక్తలంతా ముక్తకంఠంతో దుయ్యబట్టారు. అర్బన్ నక్సలైట్ల పేరుతో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పాలకులు ఖూనీ చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, పీకెఎస్, ఏఐవైఎఫ్, రైతు సంక్షేమ సంఘ నాయకులు మునకాల శ్రీనివాస్, పి.శంకరరావు, రాయితి సత్యం, లక్ష్మునాయుడు. గోపాలం, కోట అప్పన్న తదితరులు ప్రసంగించారు. రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రంపా రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

కోటకు విద్యుత్ సొబగులు



కోట వద్ద సందర్శకుల సందడి

విజయనగరం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ సిరిమానోత్సవం నేపథ్యంలో చరిత్రాత్మక కట్టడమైన కోటను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం తొలేళ్ల సందర్భంగా వచ్చిన భక్తులు ఎక్కువ మంది కోటను సందర్శించారు. గతంలో ఒక భాగంలోనే విద్యుత్ బల్బులను ఏర్పాటు చేసేవారు. కానీ ఈ పర్యాయం కోట చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కోర్టు ఫీ స్టాంపులను అందుబాటులోకి తేవాలి

బొబ్బిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు నెలల నుంచి కోర్టు ఫీ స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని భారత న్యాయ వాదుల సంఘ జిల్లా అధ్యక్షుడు కండాపు ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోర్టు ఫీ స్టాంపులు లభ్యం కాకపోవడంతో కక్షిదారులతో పాటు వినియోగదారులంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి స్టాంపుల కొరతను తీర్చాలని కండాపు డిమాండ్ చేశారు.

17 నుంచి ఉచిత టైలరింగ్ శిక్షణ

బొబ్బిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి స్థానిక తారక రామా కాలనీ అభిమాని ఫౌండేషన్ ప్రధాన కార్యాలయంలో ఉచితంగా మహిళలకు కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ రెడ్డి రాజగోపాలనాయుడు తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒక్కో బ్యాచ్‌కు గంట చొప్పున రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 94907 89555 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

మాజీ ఎంపీపీ రాజన్న మృతి

కొత్తవలస, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మాజీ ఎంపీపీ పొలమరశెట్టి రాజన్న(77)సోమవారం మధ్యాహ్నం విశాఖపట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. రాజన్న మృతి చెందారని తెలుసుకున్న ఆయన స్వగ్రామం మంగళపాలెం ప్రజలు విషాదంలో మునిగిపోయారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన వెంటనే ఆ పార్టీలో చేరిన రాజన్న చివరి వరకు అదే పార్టీలో కొనసాగారు. కొత్తవలసకు మొట్టమొదటి ఎంపీపీగా ప్రజల నుంచి నేరుగా ఎన్నికయ్యారు. ఎంపీటీసీల వ్యవస్థ వచ్చిన తరువాత మరోసారి ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఎంపీపీ పదవిని మహిళకు కేటాయించడంతో ఆమె భార్య శాంత కుమారిని ఎంపీపీని చేసి తాను వైస్ఎంపీపీగా కొన్నాళ్లు కొనసాగారు. ఉత్తరపల్లి నియోజకవర్గం ఉన్నప్పుడు ఒకసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.టీఎన్‌టీయూసీలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ పదవులను చేపట్టారు. కొత్తవలసలోని జేఎస్ఎల్ కర్మాగార కార్మిక సంఘానికి గౌరవాధ్యక్షుడుగా కొనసాగారు. ఆయన మృతికి ఎమ్మెల్యే లలితకుమారి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవోగా రాజ్‌కుమార్

రేగిడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంకిలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) ఇన్‌చార్జ్ సీఈఓగా గొద్దు రాజ్‌కుమార్ సోమవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్యాలయవర్గాలు వెల్లడించాయి.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి

బొబ్బిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని, వాటిని గణనీయంగా తగ్గించాలని జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు ఆకుల దామోదరరావు డిమాండ్ చేశారు. మద్యం సీసా ధరను రూ.99 రూపాయలకు తగ్గిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటిస్తోందని... అంతకన్నా ముందు రూ.160 పలుకుతున్న వంట నూనె ధరను తగ్గించాలని ఆయన కోరారు. కూరగాయల ధరలను సైతం ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. మూడు నాలుగు ప్రభుత్వాలు మారినా రైతు బజారు హామీని నెరవేర్చలేకపోయారని దుయ్యబట్టారు. రేషన్ డిపోల్లో కేవలం 35 శాతమంది కార్డుదారులకే రాయితీపై కందిపప్పు ఇస్తున్నారని, మిగిలిన వారి మాటేమిటని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ధరల నియంత్రణకు పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు.

అలరించిన నాటక ప్రదర్శనలు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సోమవారం గురజాడ కళాభారతిలో నిర్వహించిన ఏకపాత్రాభినయాలు, సాంఘిక, పౌరాణిక నాటిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కురిమెళ్ల శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆడిషన్' హాస్య నాటిక కడుపుబ్బా నవ్వించింది. కళాక్రియేషన్ రాజాం ఆధ్వర్యంలో 'పావు', ఈపు అప్పలస్వామి నాటక అకాడమీ ఆధ్వర్యంలో 'కెరటాలు', రెడ్డి ఆదినారాయణ నాటక అకాడమి ఆధ్వర్యంలో శ్రీరామంజనేయ యుద్ధం, బి లక్ష్మీ నాటకశాల ఆధ్వర్యంలో చింతామణి నాటకాలను ప్రదర్శించారు. సత్యారావు నాటక అకాడమీ ఆధ్వర్యంలో 'సత్యహరిశ్చంద్ర, శ్రీకళా సాగర నాటక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీ అపర్ణ నాటక సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామంజనేయ యుద్ధం, నక్షత్రకుడు, చంద్రమతి, కాల, విటభ ఏకపాత్రాభినయాలు ఆకట్టుకున్నాయి.

పనులకు ప్రణాళిక అవసరం

రాజాం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఏ పనులు ఎప్పుడు చేపట్టాలో అనే విషయంలో ప్రణాళిక ప్రకారం అంచనాలు తయారు చేశామని.. ఆమేరకు పనులు చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం బొమ్మినాయుడువలస గ్రామంలో 2025-26కు సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టాల్సిన పనులు విషయంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సాయిరాం పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా ఉత్సవాలు

విజయనగరం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పైడితల్లమ్మవారి ఉత్సవాల్లో భాగంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. మహిళల కబడ్డీలో విజయనగరం జట్టు విజేతగా నిలవగా...కృష్ణా, శ్రీకాకుళం జట్టు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. పురుషుల ఖోఖో పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. పురుషుల వాలీబాల్‌లో విజయనగరం, స్టీల్‌ప్లాంటు , పార్వతీపురం-మన్యం జిల్లా తొలి మూడు స్థానాలు సాధించాయి. బ్యాడ్మింటన్ డబుల్స్ లో జి.నీరజ్ సాయికుమార్, కె.రాహుల్, షేక్ ఆమన్, కె.శ్రీనులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అండర్-19 పురుషులు, బాలికల జట్లలో కె.పవన్, విజయభరద్వాజ్, వి .జాహ్నవి, ఎస్.లాస్యశ్రీ జంటలు విజేతలుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవంలో డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పి.సీతారామరాజు పాల్గొన్నారు.

అన్నసమారాధన

లక్కవరపుకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల ఆఖరి రోజైన సోమవారం ఎల్.కోటలో అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనాథు పెదబాబు దుర్గాదేవికి పూజలు చేశారు.

తెలుగుదేశం ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి



శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బేబీనాయన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

తెర్లాం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి. ఎస్.కె.కె. రంగారావు (బేబీనాయన) అన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన గుర్తు చేశారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మండలానికి మంజూరైన రూ.719.65 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువలు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామాభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హేమలత, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటనాయుడు, ఎంపి.డి.ఒ. రాంబాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు స్వర్ణయుగం

రాజాం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాలనలో గ్రామీణ ప్రాంతాలకు స్వర్ణయుగం వస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం శ్యాంపురం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.30 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. రాజాం మండలంలో 94 సీసీ రోడ్లకు గ్రాంట్లు మంజూరయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే సూపర్ సిక్స్‌లోని హామీలను ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి నెరవేరుస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో సర్పంచులకు గౌరవం పెరిగిందన్నారు. దేశం మొత్తం రాష్ట్రం వైపు చూ సే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతోందని ఎమ్మెల్యే కోండ్రు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, సుమల మన్మథరావు, ఎల్.కృష్ణమూర్తి, బోనెల నారాయణరావు, మరిపి జగన్మోహన్‌రావు, టంకాల నాగరాజు, మద్దు హరి, బట్న సూర్యనారాయణ, చీడి కుమార్ పాల్గొన్నారు.

సంగాంలో...

వంగర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగాంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోండ్రుమురళీమోహన్ సోమవారం శంకుస్థాపన చేశారు. బాగెమ్మపేట, పటువర్ధనం, శ్రీహరిపురంలలో రహదారులు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వంగర మాజీ సర్పంచ్ మృతిచెందటంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, మోహనరావు, ధనలక్ష్మి, త్రినాథ పాల్గొన్నారు.

పల్లెల కోసమే ఈ పండగ

లక్కవరపుకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధి కోసమే పల్లెపండుగ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం ఖాసాపేట, రంగారాయపురం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఖాసాపేటలో రూ.15లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రంగారాయపురంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ఒబ్బిన సత్యనారాయణ, జీఎస్.నాయుడు, సర్పంచ్ భూపాల్‌నాయుడు, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రత్యేక పూజల్లో మంత్రి



సాలూరు రూరల్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): సాలూరు పంచముఖేశ్వర ఆలయంలో బాలా త్రిపుర సుందరి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం జరిగిన పూర్ణాహుతి పూజల్లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఆమె పూర్ణాహుతి ద్రవ్యాలు తలపై మోశారు. అనంతరం లలితా హోమగుండంలో పూర్ణాహుతి చేశారు. మాజీ కౌన్సిలర్ నూతి రాజేశ్వరి ఇంటిలో జరిగిన అగ్ని గంగమ్మ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి పసుపుకొమ్ముల తులాభారం ఇచ్చారు. అమ్మవారి ఘటాన్ని మోసి మొక్కు చెల్లించారు. కామాక్షి ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కనక పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో బొడ్డవలస విద్యార్థి ప్రతిభ

సాలూరు రూరల్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ పోటీల్లో బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థి పి.జనార్థన సాయి కాంస్య పతకం సాధించాడు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్ సోమవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈసందర్భంగా పతకం సాధించిన విద్యార్థికి బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, గురుకుల ఉపాధ్యాయులు అభినందించారు.



పార్వతీపురం: ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

నిరసనల హోరు

- కలెక్టరేట్ వద్ద వివిధ సంఘాల నాయకుల ఆందోళన
- ఐటీడీఏ వద్ద గిరిజనుల ధర్నా
- సీతానగరంలో భవన నిర్మాణ కార్మికుల నిరసన

బెలగాం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సోమవారం నిరసనలతో హోరెత్తింది. తమను ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకురావాలని ఏఎన్ఎంలు ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ముందుగా బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సచివాలయ ఏఎన్ఎం రమాదేవి మాట్లాడుతూ సచివాలయ ఏఎన్ఎంలను తక్షణమే ఆరోగ్య శాఖలోకి తీసుకురావాలని, తమకు 35 క్యాజువల్ లీవ్‌లు అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

టేకరకండి, జియ్యమ్మవలస గ్రామానికి చెందిన గిరిజనులు సాగు భూమిలో కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం చేపట్టారని, భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని గిరిజనులు ఎ.రాజేష్‌కుమార్, మురళి, ఎ.శ్రీనివాసరావు, ఎ.ధర్మారావు తదితరులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.

ఐటీడీఏను యథావిధిగా కొనసాగించాలి

పార్వతీపురం ఐటీడీఏను యథావిధిగా కొనసాగించాలని గిరిజన సంఘం నాయకు లు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రంజిత్ మాట్లాడుతూ ఐటీడీఏ నిధులు గిరిజన సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాలని, ఐటీడీఏలకు రెగ్యులర్ అధికారులను నియమించా లని, ఐటీడీఏ పాలక సమావేశం నిర్వహించాలని కోరారు. ● పార్వతీపురం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పాటైన తర్వాత పార్వతీ పురం ఐటీడీఏ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్ ఆరోపించారు. సోమవారం చలో ఐటీడీఏ పేరుతో ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఐటీడీఏకు రెగ్యులర్ అధికారులను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి

సీతానగరం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక సరఫరా చేసే భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము, మండల కార్యదర్శి తోలాపు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి జి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- పీజీఆర్ఎస్‌కు 24 వినతులు



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు గిరిజనులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు వినతులు సమర్పించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 24 వినతులు వచ్చాయి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని బి.కమల కోరారు. నీరు-చెట్టు పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించేలా చూడాలని బందమానుగూడ గ్రామానికి చెందిన సవర నాగరాజు కోరారు. అటవీహక్కు పత్రాలు, తాగునీటి సౌకర్యం, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల బిల్లు, మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు, ఆటో రుణం మంజూరు చేయాలని పలువురు గిరిజనులు పీవోను కోరారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పీవోతో పాటు ఏపీవో జి.చిన్నబాబు, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 3 ఫిర్యాదులు

బెలగాం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే పోలీసుల బాధ్యత అని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ వేదికలో 3 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ తెలిపారు. ఎక్కువగా నకిలీ పత్రాలు, కుటుంబ తగాదాలు, ఆన్‌లైన్ మోసాలు, భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్టు చెప్పారు. డీసీఆర్‌బీ సీఐ ఎర్రంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

లైన్‌మన్‌ను నియమించండి

బెలగాం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం పరజపాడు పంచాయతీకి ఎలక్ట్రికల్ లైన్‌మన్‌ను నియమించాలని ఆ గ్రామ సర్పంచ్ గుంట్రెడ్డి రామకృష్ణ సోమవారం కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. గత రెండేళ్లుగా లైన్‌మన్‌ను నియమించలేదని, దీంతో ఈ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, గదబవలస, పరజపాడు గ్రామాల ప్రజలు, రైతులు విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు.

వాడవాడలా 'పల్లె పండుగ'

- జిల్లాలో ఘనంగా కార్యక్రమం ప్రారంభం
- సీసీ రోడ్లకు శంకుస్థాపనలు



పాలకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ





పార్వతీపురం రూరల్: బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, గుమ్మలక్ష్మీపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పార్వతీపురం రూరల్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ● పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండలంలోని అడ్డాపుశిల గ్రామం నుంచి పిన్నింటి రామినాయుడువలస గ్రామం వరకు రెండు కిలోమీటర్ల పొడవున రూ.75లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● సీతా నగరం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): సుమిత్రా పురంలో పల్లె పండుగ వారోత్సవాలను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సోమవారం ప్రారంభించా రు. సుమిత్రాపురం గ్రామం నుంచి వల్లరగుడబ గ్రామం వరకు రూ.2 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనా యుడు, రౌతు వేణుగోపాలనాయుడు, ఎంపీడీవో త్రివిక్రమరావు, తహసీల్దార్ ప్రసన్నకుమార్, టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, జి.చంద్రమౌళి, కృష్ణరాయపురం సర్పంచ్ అన్నంనాయుడు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం/ కురుపాం రూరల్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): పల్లె పండగతో అభివృద్ధి ఖాయమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో సోమవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్ర మంలో ఆమె పాల్గొన్నారు. సవరకోటపాడు గ్రా మంలో ఉన్న ఐటీడీఏ పార్క్‌లో సీసీ రోడ్డుకు, కురుపాం మండలంలో మరిపల్లి, దురుబిల్లి గ్రామాల రహదారులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు సాల్మన్‌రాజ్, ఉమామహేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షులు పాడి సుదర్శనరావు, కొండయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కోల రంజిత్ కుమార్, జనసేన నియోజకవర్గ సమన్వ యకర్త కద్రక మల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ తాడంగి లక్ష్మణరావు, కూటమి నాయకు లు పాల్గొన్నారు. ● పాలకొండ, అక్టోబరు 14, (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పల్లెల ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని టీడీపారాపురం మీదుగా టీకేరాజపురం నుంచి తలవరం గ్రామం వరకు రూ.కోటి 50 లక్షలతో మంజూరైన తారురోడ్డును సోమవారం ఆయన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ.. ఏమిటీ పరిస్థితి?

(ఐదో పేజీ తరువాయి)

కొనుగోళ్లు ఇలా..

సీతంపేట రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సీతంపేట గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో 2022-23లో ఆఫ్‌లైన్‌లో 1.36 లక్షల కొండచీపుర్లను కొనుగోలు చేశారు. ఆన్‌లైన్(ఎంఎస్‌టీసీ) విధానం వచ్చే సరికి 2023-24లో 9,492 కొండచీపుర్లను మాత్రమే కొనుగోలు చేశారు. ఆఫ్‌లైన్‌లో మార్కెటింగ్ చేసేటప్పుడు ఇక్కడ కొన్న ఉత్పత్తులను జీసీసీ ప్రధాన కార్యాలయం(విశాఖపట్నం)లోని గొడౌన్‌కు తరలించి విక్రయాలు జరిపేవారు. ఈ ప్రాంత కొండ చీపుర్లను ఏ-1 గ్రేడు రకం రూ.45, బీ గ్రేడు రూ.40, సీ గ్రేడ్ రకానికి జీసీసీ రూ.35 చెల్లించి గతంలో కొనుగోలు చేసేది. కానీ నేడా పరిస్థితి లేదు. ఏడాది కాలంలో కొండచీపుర్లతో పాటు మిగిలిన అటవీ ఉత్పత్తుల కొనుగోలులో జీసీసీ చేతు లెత్తేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● సీతంపేట వారపు సంతకు వేల సంఖ్యలో కొండచీపుర్లను గిరిజనుల తీసుకొచ్చి మైదాన వ్యాపారులకు కారు చౌకగా విక్రయిస్తున్నారు. ఇదే విషయాన్ని జీసీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఇది కొండచీపుర్ల సీజన్ కాదని చెబుతున్నారు. ● ఈ ఏడాది నరమామిడి చెక్క, నల్లజీడి ఉత్పత్తులనైతే పాతపట్నం బ్రాంచ్ పరిధిలో కేవలం 40 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. గతంలో జీసీసీ ద్వారా కొనుగోలు చేసిన నరమామిడి చెక్కను అగర్‌బత్తీల తయారీకి వినియోగించే వారు. రంగుల తయారీ చేసే కంపెనీలకు ఈ సంస్థ నల్లజీడిని విక్రయించేంది. అయితే ఇంత లాభదాయకమైన ఉత్పత్తులను జీసీసీ ఎందుకు కొనుగోలు చేయడం లేదో అర్థం కావడం లేదు.

నష్టపోతున్న గిరిజన రైతులు

గిరిజన రైతులు సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. కొండ



సీతంపేట సంతలో విక్రయించేందుకు తీసుకువచ్చిన కొండచీపుర్లు

చీపుర్లు, చింతపండు, నల్లజీడి, నరమామిడి చెక్క వంటి వాటిని జీసీసీ తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తోంది. ఇదే అదునుగా దళారులు, ప్రైవేట్ వ్యాపారులు రంగ ప్రవేశం చేసి.. అటవీ ఉత్పత్తులకు వారికి నచ్చిన ధరను నిర్ణయించి గిరిజన రైతులను నిలువునా దోచు కుంటున్నారు. వాస్తవంగా వారపు సంతల్లో గిరిజనుల నుంచి సేకరించే కొండచీపుర్లను జీసీసీ సిబ్బంది గ్రేడ్‌లుగా విడదీసి.. ధరను నిర్ణయించి కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ప్రైవేటు వ్యాపారులు అన్ని రకాల ఉత్పత్తులను బల్కేజ్ కింద తీసుకొని గిరిజనుల కష్టాన్ని దోచుకుంటున్నారు.

పర్యవేక్షణ లేక..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో సీతంపేట, పాతపట్నం కేంద్రంగా జీసీసీ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తుల విక్రయాలు, కు గిట్టుబాటు ధర, గిరిజన రైతులకు రుణాలు వంటి అంశాలను పర్యవేక్షించడానికి గతంలో డీఎం స్థాయి అధికారి ఉండేవారు. అయితే ఇటీవల కాలంలో ఇక్కడ డీఎంకు విశాఖ జీసీసీ ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో జీసీసీ డీఎం ఎప్పుడు వస్తారో, ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. పర్యవేక్షణ లేని కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇకనైనా జీసీసీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

పార్వతీపురం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. వచ్చిన అర్జీలపై తగిన సమాచారం ఇవ్వదగిన అధికారులు మాత్రమే పీజీఆర్ఎస్‌కు హాజరు కావాలన్నారు. గత వారంలో వచ్చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలపై కలెక్టర్ ఆరా తీశారు. సోమవారం ఉదయం కలెక్టర్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా జేసీ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి జిల్లా కలెక్టర్ 119 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

22న రైతు సదస్సు

పాలకొండ, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ఈనెల 22న నిర్వహించనున్న రైతాంగ ప్రాంతీయ సదస్సు విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం పాలకొండలో కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమ ణమూర్తి, కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

రహదారి పనులపై విచారణ

సీతంపేట రూరల్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన రహదారి నిర్మాణ పనుల్లో అవినీతి జరిగినట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు శ్రీకాకుళం విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. శిలగాం, దేవనాపురం పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రహదారి పనుల్లో అవినీతి, అక్రమాల ఆరోపణలు వచ్చాయి. ఈ 20 రహదారుల్లో ఉన్న లక్కాయిగూడ-ఈతమానుగూడ (రూ.1కోటి), గొయ్యిగూడ- జోడుమా నుగూడ(రూ.50) రహదారి పనులను విజిలెన్స్ డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ గణేష్ సోమవారం తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో రహదారులను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. ఈ తనిఖీల్లో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఏఈలు నాగభూషణం, గౌరునాయుడులతో పాటు విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

జియ్యమ్మవలస, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ డి.పకీరు, నీటి పారుదలశాఖ ఏఈ జీవీ రఘు వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఏఈ రఘు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించనున్న నీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించాలని ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల పరిధిలోని రైతులు వివరాలను సేకరించాలన్నారు. ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

గరుగుబిల్లి , అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో దత్తి అప్పలనాయుడు సూచించారు. మండలంలోని హెచ్‌ఎంలతో ఆయన సోమవారం ఉల్లిభద్రలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంఈవో-2 కె.కొండలరావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

తోటపల్లి పూర్వ వైభవానికి సహకారం

గరుగుబిల్లి, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ పూర్వ వైభవానికి తగిన సహకారం అందిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ని కలిసి పలు సమస్యలను వివరించారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధి ప్రతినిధి డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ పునర్నిర్మాణం చేపట్టిన ఆలయానికి ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో సర్పంచ్ ఆవాల సింహాచలం, కన్నయ్య, ఎంపీటీసీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

సాలూరు రూరల్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళాన్ని అందజేసినట్టు సాలూరు ప్రాణదాత ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ వైద్యుడు వాడాడ గణేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈమేరకు ఈ చెక్కును రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల వేంకటేశ్వరరావు, ఇందుపూరి నారాయణరావు, గంటా వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

భామిని, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): ఎంగిడి గ్రామానికి చెందిన నిమ్మల మాధవరావుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందింది. ఆవుపై విద్యుత్ వైరు పడడంతో గట్టిగా అరుస్తూ మృతిచెందింది. నష్టపరిహారం అందేలా ప్రయత్నిస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

తెలంగాణ సీఎంకు శేష వస్త్రాలు



పార్వతీపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి పార్వతీపురం సర్వమంగళ దేవి పీఠం వ్యవస్థాపకుడు కాళిదాసుశర్మ కుమారుడు ఆదిత్య రామహరిహరశర్మ శేష వస్త్రాలను అందించారు. విజయదశమి సందర్భంగా తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డికి తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో శేష వస్త్రాలను అందించినట్టు ఆయన తెలిపారు.

మద్యం షాపులు తరలించాలి

పాచిపెంట, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయానికి ఎదురుగా ఉన్న మద్యం షాపును తక్షణమే అక్కడి నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ డి.రవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ● సాలూరు రూరల్, (ఆంధ్రజ్యోతి): సాలూరు చినబజారు జంక్షన్‌లో మద్యం షాపు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని స్థానికులు సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఒడిశా

వినతుల స్వీకరణ

రాయగడ, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని పద్మాపూర్ సమితిలో అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయత్ అధ్యక్షతన సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. 29 అర్జీలు వచ్చాయి. ఎస్పీ స్వాతి ఎస్ కుమా ర్, గుణుపురం సబ్ కలెక్టర్ కిరణ్‌దీస్ కౌర్, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్యవైద్యాధికారి లాల్ మోహన్‌రౌత్రాయ్ పద్మాపూర్ సమితి అధ్యక్షురాలు మణిమాల సబర్ అధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన

రాయగడ, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆశా వర్కర్లు సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆశా కార్మికుల జిల్లా అధ్యక్షురాలు తమలా సాహుకార్, కార్యదర్శి గీతాంజలి మియాల్, కోశాధికారి పుష్పాంజలి బెహెరా నేతృత్వంలో 11 జిల్లాల నుంచి వేల సంఖ్యలో వచ్చిన ఆశా కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. భారతీయ ముజ్దూర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగేశ్వరదాస్ మాట్లాడుతూ.. ఆశా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

ఒక్కటై.. చేజిక్కించుకుని!

(ఐదో పేజీ తరువాయి)

ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి' ...

పార్వతీపురం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి):టీడీపీ, వైసీపీ నాయకులు ఒక్కటై.. మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసు కున్నారని, ఎవరికి వచ్చినా కలిసి వ్యాపారం చేసుకుందామనే ముందస్తు ఒప్పందంతో పావులు కదుపుతున్నారని 'ఆంధ్రజ్యోతి' వరుస శీర్షికలతో వార్తలను ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే కొన్ని నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, వైసీపీ నాయకులు లాటరీ ప్రక్రియలో హాజరవడంతో 'ఆంధ్రజ్యోతి' చెప్పింది శతశాతం నిజమని తేలింది.

సీతంపేట మద్యం దుకాణంపై ఫిర్యాదు...

పాలకొండలో వలంటీర్‌గా పనిచేసిన కొండగొర్రె అన్నపూర్ణకు సీతంపేటకు కేటాయించిన ఒక మద్యం దుకాణం లాటరీలో లభించింది. అయితే దీనిపై కొంత మంది గిరిజనులు అభ్యంతరం తెలియజేస్తున్నారు. ఆమె సీతంపేట వాసి కాదని, స్వగ్రామం కొత్తూరు మండలం గొట్టిపల్లి అని, పాలకొండలో నివాసం ఉంటున్నారని చెబుతున్నారు. దీనిపై దర్యాప్తు చేయాలని సీతంపేటకు చెందిన కొంతమంది దరఖాస్తుదారులు సోమవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ శోభిక అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్రరావుతో చర్చించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం తహసీల్దార్ మంజూరు చేసిన కులధ్రువీకరణ పత్రం ఆధారంగానే దరఖాస్తు సేకరించామని.. లాటరీలో ఆమెకు మద్యం షాపు లభించిందని తెలిపారు.

పాత ధ్రువీకరణ పత్రాలతో..

ఏజెన్సీ ప్రాంతాల్లో మద్యం దుకాణాలను స్థానిక గిరిజనులకే కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో ఎంతోమంది గిరిపుత్రులు ఎప్పుడో తహసీల్దార్లతో పొందిన కుల ధ్రువీకరణ పత్రాలను పొందుపరిచి దరఖాస్తులు అందిం చారు. ఎక్సైజ్ అధికారులు కూడా వాటి ఆధారంగానే దరఖాస్తులు ఆమోదించారు. నూతన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పుడో పొందిన కుల ధ్రువీకరణ పత్రాలతో కొంతమంది స్థానికేతరులు దుకాణాలు పొందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సీతంపేట మద్యం దుకాణంపై వచ్చిన ఫిర్యాదే ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు.



లాటరీ ప్రక్రియలో పాల్గొన్న టీడీపీ, వైసీపీ నాయకులు